చెరకు.. చేదే!

- తగ్గుముఖం పడుతున్న సాగు విస్తీర్ణం
- వలస బాట పడుతున్న కూలీలు
- చక్కెర కర్మాగారాల మూసివేతే ప్రధాన కారణం
- కేవలం బెల్లం తయారీకే చెరకు పంట పరిమితం



పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లిలో చెరకు పంట

పెద్దాపురం: చెరకు సాగు కనుమరుగు కానుందా? అంటే అవుననే చెప్పాలి. చక్కెర కార్మాగారాల మూతపడడంతో చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. గతంలో పెద్దాపురం నియోజకవర్గ వ్యాప్తంగా చెరకు సాగు చేసే వారు ఎక్కువే. ప్రస్తుతం ఈ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందనే చెప్పుకోవాలి. నియోజకవర్గ పరిధిలో సామర్లకోట, పెద్దాపురం అర్బన్ ప్రాంతాలతో పాటు మూడు మండలాల్లో అత్యధికంగా 8,358 ఎకరాల్లో సాగయ్యేది. రెండేళ్ల వ్యవధిలోనే భారీగా తగ్గిపోయింది. గతంలో షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు చెరకు విత్తనాన్ని తక్కువ ధరకే ఇచ్చి రైతులను ప్రోత్సహించేవి. పంటను కూడా వారే పొలాల వద్దకు వచ్చి కొనేవారు. అప్పట్లో ఎక్కువ శాతం రైతులు ప్రధానంగా వరిపంటను సాగు చేసేవారు. ఎప్పుడూ ఒకే పంట పండించడం కంటే పంట మార్పిడి చేస్తే మంచిదన్న ఉద్దేశంతో ఎక్కువ మంది రైతులు కొత్తగా చెరకు సాగేచేసేందుకు పోటీ పడ్డారు. ఈ పంటను విస్తారంగా సాగు చేయడంతో దిగుబడి గణనీయంగా పెరిగింది. దీంతో చెరకు ఫ్యాక్టరీలకే కాక బెల్లం తయారీవైపు రైతాంగం మొగ్గుచూపింది. చెరకు ఫ్యాక్టరీలు మూతపడడంతో రైతులు చెరకును కేవలం బెల్లం తయారీకే పండిస్తున్నారు. ప్రస్తుతం బెల్లం తయారీ కోసం నియోజకవర్గంలోని ఒక్క పెద్దాపురం మండలంలోని తాటిపర్తి, మర్లావ, దివిలి, తిరుపతి, చంద్రమాంపల్లి గ్రామాల్లో మాత్రమే చెరకు సాగు జరుగుతోంది.

సాగు కాలం.. శ్రమ అధికమే

చెరకు పంట కాలం పది నెలలు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి చెరకుకు ఉంది. సాగు ప్రారంభం నుంచీ విత్తనం కోసం చెరకు నరకడం, విత్తనం నాటడం, ఎరువులు వేయడం, కలుపు తీత, జడలు అల్లడం(తాడుతీత), ఎరువు వేసిన తర్వాత కాలువలు తవ్వడం, పురుగు మందులు చల్లడం, చెరకు తోట నరకడం, ఫ్యాక్టరీలకు లోడింగ్ వేయడం.. ఇన్ని పనులు చేయాల్సి ఉంది. ఈ పనులన్నింటికీ ఎకరాకు సుమారు 150 నుంచి 200 మంది కూలీలకు ఏడాది పొడవునా పనులుండేవి.

షుగర్ ఫ్యాక్టరీల మూతే ప్రధాన కారణం

చెరకు పండించే రైతులను చక్కెర కార్మాగారాలు ఆదుకునేవి. రైతు చెరకు సాగు మొదలు పెట్టిన దగ్గర నుంచి విత్తనం సరఫరా చేయడం, ఎరువులు, పురుగు, గడ్డి మందులు ఇచ్చేవి. ఇవి కాకుండా చెరకును కొనుగోలు చేసిన తర్వాత టన్ను చెరకుకు కొనుగోలు పన్ను రూ.10 నుంచి రూ.60 వరకు కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి నేరుగా రైతులకు చెల్లించేవారు. పెద్దాపురం నియోజకవర్గంలో చెరకు రైతుల నుంచి నవభారత్ షుగర్స్(సామర్లకోట) కార్మాగారం నుంచి రోజుకు పది నుంచి పదిహేను లక్షల టన్నుల వరకు చెరకు కొనుగోలు చేసేది. పదేళ్ల కిత్రం పిఠాపురం, నాలుగేళ్ల క్రితం చెల్లూరు, రెండేళ్ల క్రితం సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీలు మూతపడగా, తాండవ ఒడిదొడుకుల నడుమ కొనసాగుతోంది. ఇలా జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీలు ఒక్కొక్కటిగా మూతపడ్డాయి. అంతేగాక చెరకు సాగుకు శ్రమ, ఖర్చు ఎక్కువే. నీటి లభ్యతకు కూడా ఇబ్బందులే. దీంతో చెరకు సాగుకు ప్రోత్సాహం సన్నగిల్లుతూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో రైతులు వరి, ఆరు తడిపంటల వైపు దృష్టి సారించారు. చెరకు పంట ఒకసారి చేతికి అందేలోపు తక్కువ సమయంలో రెండు సార్లు వరి, ఆరు తడిపంటలు దిగుబడులు అందిపుచ్చుకోవడంతో రైతులు రానురానూ చెరకు సాగు తగ్గించేశారు. చెరకు కూలీలు కూడా ఉపాధి కోసం వలసలు పోవలసిన పరిస్థితి.



మండలంలోని తిరుపతిలో చెరకును బెల్లం ఆడుతున్న క్రషర్



బెల్లం తయారు చేస్తున్న కార్మికుడు

నవభారత్ మూత రైతాంగానికి తీరని వ్యథ

నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట నవభారత్ (షుగర్స్) ఫ్యాక్టరీ మూత పడడంతో ఫ్యాక్టరీ పరిధిలోని వేల మంది రైతంగానికి అపార నష్టం వాటిల్లింది. ఒక్క పెద్దాపురం సెగ్మెంట్ కాకుండా డివిజన్ వ్యాప్తంగా షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, రాజానగరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల నుంచి చెరకు అధిక స్థాయిలో ఇక్కడకు వచ్చి చేరేది. అంతేగాక తుని, పిఠాపురం, చెల్లూరు ఫ్యాక్టరీల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి సామర్లకోట నవభారత్‌కు సుమారు నాలుగు లక్షల టన్నులకు పైగా చెరకు పంట ఇక్కడికే వచ్చేది.

నియోజకవర్గంలో ఈ ఏడాది చెరకు సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)..

మండలం	మూడేళ్ల క్రితం	గత ఏడాది	ప్రస్తుతం
పెద్దాపురం అర్బన్	1875	లేదు	లేదు
సామర్లకోట అర్బన్	1630	లేదు	లేదు
పెద్దాపురం రూరల్	2865	425	320
సామర్లకోట రూరల్	1988	లేదు	లేదు
మొత్తం	8,358	425	320

చెరకు పరిశ్రమను ప్రోత్సహించాలి



ఎన్నో వేల కుటుంబాలకు జీవనోపాధిని కల్పించే చెరకు సాగు పెద్ద పరిశ్రమ. ఈ పరిశ్రమ దెబ్బ తినడం వల్ల ప్రభుత్వాలు ఉపాధి హామీ పనులు కల్పించాల్సి వచ్చింది. ప్రభుత్వాలపై ఆర్థిక భారం పడింది. చెరకు సాగుకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలి. చక్కెర పరిశ్రమలను తెరిపించి, చెరకు సాగును ప్రోత్సహించాలి.

– నల్లల గోవిందు, చెరకు పంట రైతు, కట్టమూరు, పెద్దాపురం మండలం

ఆరుతడి పంటలపైనే రైతుల దృష్టి



చెరకు పంటపై రైతులకు ఆసక్తి తగ్గిన మాట వాస్తవమే. సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉన్న చోట మాత్రమే బెల్లం తయారీకి ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ పంటకు పెట్టుబడులు కూడా పెరిగిపోయాయి. చెరకు ఒక పంటకు అయ్యే ఖర్చుతో ఆరుతడి పంటలు రెండు దఫాలుగా పండించవచ్చు. శ్రమ కూడా తక్కువే. దీంతో అధిక శాతం రైతులు చెరకుకు ప్రత్యామ్నాయంగా వరి, ఆరుతడి పంటలను ఎంచుకుంటున్నారు.

– దైవకుమార్, ఏడీఏ, పెద్దాపురం

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరికీ సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక ఆదివారం అన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలందరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సీజన్‌లో జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు ఎక్కువగా సోకుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద దోమలు రాకుండా ఆల్‌అవుట్ లిక్విడ్‌లు వాడాలని, పిల్లలకు దోమ తెరలు తప్పని సరిగా అమర్చాలని, ఇంటి పరిసరాల్లో నిరుపయోగంగా ఉన్న డ్రమ్ముల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఆహార పదార్థాలను తినాలి. ఎటువంటి అనారోగ్యం కలిగిన వైద్యాధికారులు సంప్రదించాలని ఆమె సూచించారు. ముఖ్యంగా ఇళ్ల దగ్గరలో మురిగునీరు, చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలని ఆమె సూచించారు.

కళకళలాడిన సాగరతీరం



పర్యాటకులతో కిటకిటలాడిన సాగరతీరం

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరం ఆదివారం సందర్శకులతో పోటెత్తింది. ఉప్పాడ నుంచి కాకినాడ వరకు ఉన్న తీర ప్రాంతం సందర్శకుల కేరింతలతో కళకళలాడింది. అయితే తీర ప్రాంతం వెంబడి నిలువ నీడ లేకపోవడంతో పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పర్యాటక కేంద్రంగా మారుతున్న ఉప్పాడ తీరానికి జిల్లా నలుమూలల నుంచి నిత్యం పర్యాటకులు వస్తున్నారు. సెలవులతో పర్యాటకు సంఖ్య మరింత పెరుగింది.

సారా బట్టీలపై పోలీసుల దాడి



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: సారా బట్టీలపై దాడి చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తమూలపేట సమీపంలో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై రామలింగేశ్వరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. సారా బట్టీ నిర్వహిస్తున్న కొత్తమూలపేటకు చెందిన కొప్పిశెట్టి మంగరాజును అరెస్టు చేసి తన వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు 100 లీటర్ల బెల్లపుఊటను సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ సారా నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు. సారా తయారీ, విక్రయించినా సమాచారం అందించాలని కోరారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్పలు



ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

కొత్తపల్లి: అయ్యప్పస్వామి జ్యోతి దర్శనానికి మండలం నుంచి ఆదివారం స్వాములు ఇరుముడులతో బయలుదేరి వెళ్లారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి శివారు పెదకలవలదొడ్డికి చెందిన స్వాములు అయ్యప్పస్వామి దీక్షను పూర్తి చేసుకుని గురుస్వామితో ఇరుముడి కట్టుకుని శబరిమల బయలు దేరారు. కొత్తపల్లిలో వేంచేసిన బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి ఆలయం, పెద్దకలవలదొడ్డిలో ఉన్న రామాలయంలో స్వాములు ఇరుముడి కట్టుకున్నారు. పలు గ్రామాల నుంచి స్వాములు ఇరుముడులు కట్టుకొని శరణుఘోష చెప్పుకుంటూ శబరిమలకు బయలుదేరారు. పలు ఆలయాలు అయ్యప్ప భక్తుల శరణుఘోషతో మార్మోగాయి.

జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి

కాకినాడ సిటీ: బాలికలకు విద్యను దూరం చేసే జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని యూటీఎఫ్ మహిళా విభాగం డిమాండ్‌చేసింది. ఆదివారం యూటీఎఫ్ హోంలో జిల్లా సహాధ్యక్షురాలు బి.నాగమణి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి సభను నిర్వహించిన సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యమాలు–సమాజం మార్పు శ్రామిక మహిళల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ సమాజంలో మార్పులో మహిళా ఉద్యమాల పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు.

గుండెపోటుతో ఏపీఓ మృతి



ఏపీఓ మధుసూదనరావు(ఫైల్)

ఏలేశ్వరం: మండలంలో ఉపాధి ఏపీఓగా పనిచేస్తున్న ఐ.మధుసూదనరావు (52) ఆదివారం గుండుపోటుతో మృతి చెందాడు. మధుసూదనరావుకు స్వగ్రామం పిఠాపురంలో తెల్లవారుజామున గుండెపోటు రాగా కాకినాడలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివాదరహితుడిగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే ఏపీఓ మృతి చెందడంతో మండలంలో విషాదం నెలకొంది. ముందురోజు కార్యాలయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన ఏపీఓ గుండెపోటుతో మృతి చెందడాన్ని సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేటి నుంచి శ్రీ ప్రకాష్‌లో జాతీయ స్థాయి టీటీ పోటీలు

పెద్దాపురం: స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్టు పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్ ప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 24 క్లస్టర్లలో గెలుపొందిన సుమారు వెయ్యి మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలను టీటీ అకాడమీ అధ్యక్షుడు వి.భాస్కరరావు, పాఠశాల పూర్వ విద్యార్థి, ఏపీ రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ప్రముఖ ఫిలాంత్రోపిస్ట్, స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ చైర్మన్ సీబీఆర్ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి..



ప్రమాదానికి గురైన రాజు

సామర్లకోట: స్థానిక గణేష్ కాలనీలో ఆదివారం 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి మట్టాడ రాజు(16) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంటిపై ఉన్న ఆనపపాదు నుంచి కాయ కోసే సమయంలో వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. సుమారు 15 ఏళ్లుగా ఇళ్ల మీదుగా విద్యుత్ వైర్లు ఇళ్ల మీదుగా వెళుతున్నాయి. అధికారులు వాటిని మార్పు చేయాల్సి ఉంది.

సంప్రదాయ పద్ధతిలో సంక్రాంతి జరుపుకోవాలి

విజేతలకు బహుమతులు అందజేసిన ఎంపీ వంగా గీత



సంక్రాంతి భోగి మంటలను తిలకించిన చైర్‌పర్సన్, సీఐ తదితరులు

సామర్లకోట: సంప్రదాయ పద్ధతిలో సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక 31వ వార్డు దుర్గమ్మ గుడి వద్ద పట్టణ స్థాయిలో ఏర్పాటు చేసిన సంక్రాంతి పోటీల్లో విజేతలకు ఆదివారం ఆమె బహుమతులు అందజేశారు. 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో భోగి మంటలు, పిండి వంటలు, పిల్లలకు డ్రాయింగ్, ముగ్గులు, యువతకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు పోటీలు తిలకించడానికి వచ్చిన వారికి కూపన్లు ఇచ్చి డ్రా నిర్వహించి వంగా గీత బహుమతులు అందజేశారు. ఆయా పోటీల్లో విజేతలకు ఎంపీ గీత, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సై టి.సునీత, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పాలిక కుసుమ, రెడ్నం సునీత, కానేటి రాజేశ్వరీ, జట్ల మోహన్ స్వయంభారపు వీరభద్రరావు, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీ గీత తదితరులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ వంగా గీత

పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా..

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ..



వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: మీ కుటుంబంలో పింఛన్, ఇళ్లస్థలం కాపు నేస్తం ఇలా ఆరు పథకాలు వచ్చాయి అన్నీ సక్రమంగా అందుతున్నాయా ఏమన్నా ఇబ్బంది ఉందా అంటూ లబ్ధిదారులను ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రశ్నించారు. పిఠాపురం 9వ వార్డు సచివాలయ పరిధిలో 15, 16 వార్డుల్లో ఆయన ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికీ తిరిగి లబ్ధిదారులను పలకరించారు. ఏఏ పథకాలు అందుతున్నాయో చదివి వినిపించి అవి అందాయా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. స్థానికులు సమస్యలను వివరించగా వాటి పరిష్కారానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వార్డు వాసులకు వివరించారు. ఆయా సమస్యలకు సంబంధించి నివేదికలు తయారు చేయాలని మళ్లీ గడపగడపకూ వచ్చే నాటికి ఆ సమస్యలు పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కరిస్తున్నామని కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తుండగా రోడ్లు, డ్రైన్లు వంటి సమస్యలకు వెంటనే తగిన ఆదేశాలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందని ఇల్లు అంటూ ఏది కనిపించడం లేదని ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆయన స్థానిక వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

14 నుంచి షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో 14వ తేదీ నుంచి వానరసేన సంక్రాంతి షటిల్ టోర్నమెంటు ప్రారంభించనున్నట్లు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంటు పల్లపువీధి రామాలయం సెంటర్‌లో కొత్త సచివాలయం సమీపంలో ఉన్న క్రీడా స్థలంలో ఈనెల 14,15,16 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో విజేతకు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలను అందించనున్నట్టు తెలిపారు. ఈ టోర్నమెంటులో పాల్గొనేందుకు నిర్వాహకులను సంప్రదించాలన్నారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం



సామర్లకోట మోటారు సైకిళ్ల అసోసియేషన్ నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు

సామర్లకోట: మోటారు సైకిల్ రిపేరింగ్ యజమానులు, వర్కర్లు ఐక్యతతో ఉంటే సమస్యలను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని మోటారు సైకిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి కన్నారావు అన్నారు ఆదివారం స్థానిక నీలమ్మ చెరువు వద ఉన్న ఈఎస్ఎన్ కల్యాణ మండపంలో సామర్లకోట మోటారు సైకిలు సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు పాల్గొని ఐక్యతగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ మేరకు గతంలో ఉన్న కమిటీనే కొనసాగించే లా నిర్ణయించారు. సుమారు 40 ఏళ్లుగా మోటారు సైకిళ్ల రిపేరింగ్ వృత్తిపై ఆధారపడి 100 మంది పని చేస్తున్నారని సంఘ అధ్యక్షుడు ఎండీ అనిఫ్ తెలిపారు. సంఘ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘ అధ్యక్షుడిగా ఎండీ అనిఫ్, గౌరవాధ్యక్షుడిగా ఎస్ సత్యనారాయణ, కార్యదర్శిగా అలక సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా ఇందన రాము, సహాయ కార్యదర్శిగా తనుకు శ్రీను, కోశాధికారిగా నెల్లిపూడి శ్రీనులు, మరో 11 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ యాసిన్, కోశాధికారి దాసరి వీరబాబు, ఉపాధ్యక్షుడు తుని రమణ, సహాయ కార్యదర్శి మేడిశెట్టి తిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు జిల్లాల పరిధిలోని డీలర్లు మోటారు సైకిళ్ల విడిభాగాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

హైందవ చైతన్యమే భారత సంక్షేమం



సభలో మాట్లాడుతున్న ఏపీ సంస్కృతీ ఫౌండేషన్ నాయకులు

పిఠాపురం: హైందవ చైతన్యమే భారత సంక్షేమమని హిందూ మతాన్ని రక్షించుకోడానికి అందరు నడుం బిగించాలని ఏపీ సంస్కృతి డేషన్ కాకినాడ జిల్లా నాయకులు భారతీనంద మహరాజ్ స్వామిజీ అన్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఏపీ సంస్కృతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంఘ, గంగా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కొన్ని దుష్టశక్తులు హిందూ మతాన్ని విచ్ఛిన్నం చేయడానికి మత మార్పిళ్లకు పాల్పడుతున్నారని హిందువులంతా ఏకమై వాటిని తిప్పికొట్టాలన్నారు. హిందూ ధర్మ ప్రచారక్ కర్నీడి తాతీలు, రాయుడు ముత్యాలరావు, గండి కొండలరావు, పసుపులేటి సత్యనారాయణ, దత్తాత్రేయవర్మ, కె.సత్యకృష్ణ తదితరులు పాల్గొన్ని సనాతత ధర్మాన్ని అందరూ పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో పలువురు ఏపీ సంస్కృతి ఫౌండేషన్ నాయకులు, జన సంఘాలు, హిందువులు పాల్గొన్నారు.

ఎన్ని సార్లు చెప్పినా వ్యర్థమే..



వేట్లపాలెం నుంచి గోదావరి కాలువలో కలుస్తున్న వ్యర్థ జలాలు



కల్వర్టు రైలింగ్ కూలి ప్రమాదకరంగా ఉన్న వేట్లపాలెం కల్వర్టు

- గోదావరి కాలువలో కాలుష్య జలాలపై నోరుమెదపని అధికారులు
- విచ్చలవిడిగా వ్యర్థాలను వదులుతున్న వైనం
- ఈ శివరాత్రికైనా కాలువను ప్రక్షాళన చేయాలంటున్న భక్తులు

సామర్లకోట: కెనాల్ రోడ్డు వెంబడి ఉన్న గ్రామాల నుంచి కాలుష్య జలాలు విచ్చల విడిగా గోదావరి కాలువలో విడిచి పెడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా గోదావరి కాలువలో లక్షలాది మంది భక్తులు స్నానాలు చేస్తారు. ఈ మేరకు మహాశివరాత్రి ఏర్పాట్లకు సంబంధించి నిర్వహించే సమావేశంలో భక్తులు గోదావరి కాలువలో కలుస్తున్న కాలుష్య జలాలపై మొరపెట్టుకున్నారు. దాంతో సమావేశానికి హాజరైన ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ అధికారులు కాలుష్య జలాలపై నియంత్రణ చేస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకోవడం కొన్నేళ్లుగా జరుగుతుంది. అధికారులు హామీ ఇచ్చి సమావేశాలు ముగిశాక మహాశివరాత్రి సందర్భంగా భక్తులు కాలుష్య జలాలున్న నీటిలోనే స్నానాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దాంతో ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వేట్లపాలెం గ్రామంలో ఉన్న కల్వర్టు నుంచి భారీ ఎత్తున వ్యర్థజలాలు కాలువలో కలుస్తున్నాయి. ఈ కల్వర్టు రైలింగ్ కూలి ప్రమాదంగా ఉన్నా పట్టించుకోవడం లేదు. గోదావరి కాలువలో నీటిని పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల ప్రజలతో పాటు కాకినాడ కార్పొరేషన్ ప్రజలు కూడా తాగునీరుగా ఉపయోగిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల నుంచి వస్తున్న వ్యర్థ జలాలను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల నుంచి వ్యర్థ జలాలు విచ్చల విడిగా గోదావరి కాలువలోకి విడిచి పెడుతున్నారు. దీనికి తోడు ఆయా గ్రామాలకు చెందిన చెత్తను గోదావరి కాలువ వెంబడి వేస్తున్నారు. దీంతో ఆ వ్యర్థ పదార్థాలు గోదావరి కాలువలోకి వెళ్లి నీరు కాలుష్యమవుతోంది. మహాశివరాత్రి ఏర్పాట్లకు సంబంధించిన సమావేశం నిర్వహించే నాటికి అధికారులు చర్యలు తీసుకొని సమావేశంలో ప్రకటిస్తే భక్తులకు కొంత మేరకు ఊరట కలగనుంది.

కొన్నేళ్లుగా సమావేశాల్లో ప్రస్తావిస్తున్నాం...

గోదావరి కాలువలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్నానాలు చేస్తారు. ఆలయ పుష్కరిణిలో గోదావరి కాలువ జలాలు నింపుతారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గోదావరి కాలువలో ఆయా గ్రామాల నుంచి వ్యర్థ జలాలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. మహాశివరాత్రి ఏర్పాట్ల సమావేశంలో అధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకు వెళుతున్నా పరిష్కారం శూన్యం.

– నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

నోటీసులు జారీ చేస్తాం..

గోదావరి కాలువ వెంబడి ఉన్న గ్రామాల నుంచి వస్తున్న వ్యర్థ జలాలను పరిశీలించి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు ఇస్తాం. గ్రామాల నుంచి వ్యర్థ జలాలు రాకుండా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఏర్పాట్లు చేసుకోవాలి. ఈ సమస్య గత కొన్నేళ్లుగా ఉంది.

– హుస్సేన్, మున్సిపల్ డీఈ, సామర్లకోట